నవతెలంగాణ
ఆదిలాబాద్
సోమవారం | ఫిబ్రవరి 10, 2025 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

నవతెలంగాణ-తాంసి



మండలంలోని వడ్డాడి ఎక్స్‌రోడ్ సమీపంలో ఆదివారం మోటార్ సైకిల్ ఆటో ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుంకిడి నుంచి ఆదిలాబాద్ వెళుతున్న ఆటో ఆదిలాబాద్ నుంచి వస్తున్న మోటార్ సైకిల్ అవును తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొనడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న మండల కేంద్రానికి చెందిన రవితో పాటు పెద్ద గంగారాంకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించిగా అక్కడ చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారి కుటుంబ సభ్యులు తాంసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కుల వృత్తులను బలోపేతానికి కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కుల వృత్తులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని తీసుకువచ్చిందని, దీన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి రంగంలో రాణించాలని బీసీ వెల్ఫర్ అధికారి రాజలింగు అన్నారు. ఆదివారం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనలో ఏడు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న స్వర్ణకారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రాంనగర్‌లో శిక్షణ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, స్వర్ణకారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్, స్వర్ణకారుల సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పర్తి సత్యం, శిక్షకులు ప్రశాంత్, రాజు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

నవతెలంగాణ-బేల

మండలంలోని బురన్పూర్ శివారంలోని సర్వే నంబర్ 29/ఎలో అక్రమ లేఅవట్లు వేసి విచ్చలవిడిగా భవనాలు, గుడిసెలు నిర్మిస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడ శంకర్ ఆరోపించారు. వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగా వేసిన గుడిసెలను వెంటనే పంచాయతీ శాఖ అధికారులు తొలిగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కోరేంగా సోనేరావ్, సిడాం నందు కుమార్, ఆడా సంతోష్, నైతం సీతారాం, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి ఘన సన్మానం

నవతెలంగాణ-ఖానాపూర్

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని మస్కాపూర్ గ్రామ ఎంప్లాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అన్నారు. నల్గొండ జిల్లాలోని దేవరకొండ గ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ, ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన వంగ పెద్దన్నను ఆదివారం మస్కాపూర్ గ్రామ మేవ సంఘ భవనంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు అందరూ మాట్లాడుతూ పెద్దన్న చేసిన సేవలను కొనియాడారు. అనేక మంది చిన్నారులను ఉత్తమ పౌరులుగా పెద్దన్న తీర్చిదిద్దారన్నారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేవ అధ్యక్షులు పుప్పాల కృష్ణ కుమార్, ప్రధాన కార్యదర్శి చిలుకూరి రాములు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, మేవ కార్యవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాజీరావు మహారాజ్ బోధనలు ఆచరణీయం

నవతెలంగాణ-బేల

ఆధ్యాత్మిక గురువు బాజీరావు మహారాజ్ భౌతికంగా దూరమైన ఆయన బోధనలు ఆచరణీయమని, వేలాదిమంది జీవితాల్లో వెలుగులు నింపాయని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు సామ రూపేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెప్రాల గ్రామంలో వారం రోజుల నుంచి కొనసాగుతున్న బాజీరావ్ మహారాజ్ సప్తహ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. వేడుకల్లో ఆయన హాజరై పల్లకికి పూజలు నిర్వహించారు. ఇప్పటికీ భక్తులు మహారాజ్ బోధనలు అనుసరించడం నిజంగా గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మండలాధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, విపిన్, విజయ్, చంద్రకాంత్, గ్రామస్తులు గోపతి శంకర్, విలాస్ పటేల్, సాగర్, హేమంత్, ఆకాష్ ఉన్నారు.

ట్రంప్ దురహంకార చర్యలని ఖండించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారతీయులకు బేడీలు వేసి పంపిస్తున్న ట్రంప్ దురహంకార చర్యలని ఖండించాలని, స్వదేశస్తులకు ట్రంప్ బేడీలు వేసిన స్పందించని మోడీ చర్యలు సిగ్గు చేటని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్ సింగ్ అన్నారు. ఆదివారం కుమురంభీమ్ భవన్ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారతీయులను నేరస్తులుగా చెప్పి యుద్ధఖైదీలుగా ట్రీట్ చేసినట్లు చేతులకు, కాళ్లకు బేడీలు వేసి అమెరికా అధ్యక్షులు ట్రంప్ దురహంకారపూరిత చర్యలను ఖండిస్తూ, నల్ల జెండాలతో నిరసన చేశారు. ఈ సందర్భంగా జగన్ సింగ్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల ప్రజలని అమెరికా అధ్యక్షులు ట్రంప్ అవమాన పరుస్తూ, ఆత్మభిమానం దెబ్బ తినెలాగా జులుం ప్రదర్శించడం సిగ్గు చేటన్నారు. ప్రపంచ దేశాలు ట్రంప్ చర్యలను వ్యతిరేకిస్తు నిరసన తెలుపుతుంటే మన దేశప్రధాని మోడీ మాత్రం మౌనం వహిస్తూ ట్రంప్‌కు మద్దత్తు ఇవ్వడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో టీయూ సీఐ జిల్లా సహాయ కార్యదర్శి నితిన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిడం సాయికుమార్, కుమ్ర అశోక్, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడవి రేణుక, నాయకురాలు కుమ్ర వనిత పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : భారతీయులకు బేడీలు వేసి పంపిస్తున్న ట్రంప్ దురహంకార చర్యలని ఖండించాలని, స్వదేశస్తులకు ట్రంప్ బేడీలు వేసిన స్పందించని మోడీ చర్యలు సిగ్గు చేటని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కే.రాజన్న తీవ్రంగా విమర్శించారు. జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ భారతీయులను నేరస్తులుగా చెప్పి యుద్ధఖైదీలుగా ట్రీట్ చేసినట్లు చేతులకు, కాళ్లకు బేడీలు వేసి అమెరికా అధ్యక్షులు ట్రంప్ దురహంకారపూరిత చర్యలను ప్రజలు ప్రజాస్వామికవాదులు మేధావులు ఖండించాలని అన్నారు. ప్రపంచ దేశాలు ట్రంప్ చర్యలను వ్యతిరేకిస్తు నిరసన తెలుపుతుంటే మన దేశప్రధాని మోడీ మాత్రం మౌనం వహిస్తూ ట్రంప్‌కు మద్దత్తు ఇవ్వడం శోచనీయం అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య జిల్లా నాయకులు ఎం.బక్కన్న, ఎస్.గంగన్న, ఎండి. గఫూర్ పాల్గొన్నారు.

ఆర్టీఏ మెంబర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్



ఆదిలాబాద్ జిల్లా ఆర్టీఏ మెంబర్‌గా ఎన్నికైన కాంగ్రెస్ నాయకులు దూట రాజేశ్వర్‌ని ఆదివారం ఉట్నూర్‌లో నేతకాని కుల సంఘం నాయకులు శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. నేతకాని జాతి నుంచి తమ కులానికి దక్కిన గౌరవంగా మేము భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నేతకాని కుల సంఘం సభ్యులు కొత్తపల్లి మహేందర్, గొల్లపల్లి నర్సయ్య, ముంజం గంగేశ్వర్, జాడి రాజేశ్వర్, జాడి మల్లయ్య, చందనగిరి, విజయ్, బండి విజయ్, దర్శన, గంగరాజు కొత్తపల్లి రాజమల్లు, ముంజం భాస్కర్, బండి గంగులు, ముంజంగా గవాస్కర్, దుర్గం సుభాష్, దూత మహేందర్, సోగల ప్రవీణ్, బోర్లకుంట రాజన్న, బండి మల్లయ్య పాల్గొన్నారు.

ఆధార్ కష్టాలు తీరేనా..?

- అప్‌డేట్ కోసం ప్రజల ఇబ్బందులు
- పథకాలకు అర్హత కోల్పోతున్న పేదలు
- అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయాలి వేడుకోలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లక్షెట్టిపేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బంద్ అయిన ఆధార్ కేంద్రం

ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు అర్హత పొందాలంటే ఆధార్ కార్డు తప్పని సరి కావడంతో ప్రజలు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఆధార్ కేంద్రాల కొరత, ఉన్న కేంద్రాలు సరిగా పనిచేయకపోవడంతో లక్షెట్టిపేట పట్టణ, గ్రామీణ ప్రజలకు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. 2019లో మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో యూఐడీఏఐ సంస్థ ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం నిర్వాహకుల తప్పిదాలతో సేవలు నిలిచిపోయాయి. గత మూడేండ్లుగా మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం పనిచేయక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షెట్టిపేట పట్టణంలోని టీజీబీ, ఎస్‌బీఐలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఆధార్ అప్‌డేట్ చేయడంలో తప్పిదాల వల్ల ధరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే దూరభారం తప్పడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు.

తిరస్కరణకు గురవుతున్న ధరఖాస్తులు

ఆధార్ నమోదు, మార్పులు, చేర్పుల కోసం నిత్యం ప్రజల ఆధార్ అప్‌డేట్ కోసం తిప్పలు పడుతున్నారు. ఐరిస్, వేలి ముద్రలు, చిరునామ, పేర్లు, పుట్టిన రోజు ఇలా అనేక మార్పుల కోసం ఆధార్ కేంద్రాలకు వెళితే అక్కడ నిర్వాహకుల తప్పిదాల వల్ల చాలా వరకు తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు ఆధార్ సేవలు అత్యవసరం కావడంతో ఉన్న కేంద్రాలు బారులు తీరుతున్నారు. కేంద్రాలకు పెద్ద ఎత్తున ప్రజలు రావడంతో తొందరపాటు వల్ల నిర్వాహకులు తప్పిదాలు చేయడంతో చాలావరకు తిరస్కరణకు గురవుతున్నాయి. మళ్లి ధరఖాస్తు చేసుకోవడానికి సమయం పట్టడంతో పలువురు ఆందోళనకు గురవుతున్నారు. తప్పని పరిస్తితుల్లో కొందురు జిల్లా కేంద్రానికి వెల్లేందుకు వ్యాయ ప్రయాసాలకు, దూరభారానికి గురవుతున్నారు.

ఆధర్ కేంద్రాలు అవసరం

మండలంలో 18 గ్రామ పంచాయతీలు, ఒక మున్సిపాలిటీ ఉండగా మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. 18 గ్రామాల్లో 29045 జనాభ ఉండగా మున్సిపల్ పరిధిలో 24543 జనాభ ఉంది. ఇంత జనాభ ఉన్న మండలానికి కనీసం ఐదు ఆధార్ కేంద్రాలు ఉండాలని పలువరు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి ఉన్న ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం

సయ్యద్ హాది, మున్సిపాలిటీ, లక్షెట్టిపేట.



మండల కేంద్రంలో ఆధార్ సేవలు పని చేయడం లేదు. దీంతో ఆధార్‌లో ఏదైనా మార్పులు, చేర్పులు చేసుకోవడానికి అవస్థలు పడుతున్నాం. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇలా ఎంత కాలం ఇబ్బందులు పడాలో తెలియడం లేదు. అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలి.

త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం

ఏ దిలీప్ కుమార్, తహసీల్దార్, లక్షెట్టిపేట.



మండల కేంద్రంలోని ఆదార్ కేంద్రాన్ని త్వరలోనే ప్రారంబించి సమస్యను పరిష్కరిస్తాం. ఆదార్ కేంద్రం మార్పుల, చేర్పుల విషయంలో తప్పులు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో, దాంతోపాటు ప్రతిసారి ఆధార్‌లు రిజెక్టులు కావడంతో కోర్టు కేసులలో ఉండటంతో సేవలు నిలిపివేయడం జరిగింది. కోర్టు సమస్యలు పరిష్కారం కాగానే వెంటనే ఏర్పాటు చేస్తాం.

మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణలో మాలీలకు ఎస్టీ హోదా కల్పించేందుకు ప్రభుత్వానికి విన్నవిస్తామని మాలీ మహాసంఘం జాతీయ అధ్యక్షుడు విలాస్ రావు పాటిల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని యాదవ సంఘ భవనంలో మాలీ సంఘం మహా సమ్మేళనం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅథితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు జ్యోతిభాపూలేను కీర్తిస్తూ చేసిన నృత్యాలు ఆలరించాయి. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు విలాస్‌రావు పాటిల్ మాట్లాడుతూ ఏపీలో మాలీలు ఎస్టీగా కొనసాగుతున్నారన్నారు. కానీ తెలంగాణ మాత్రం ఎస్టీ హోదా రాలేదన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సమాజాన్ని జాగృతం చేయడంతో ఆడపిల్లల చదువుకు కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల జీవిత చరిత్రలను పాఠ్యంశాల్లో పొందుపర్చాలన్నారు. వారు చేసిన సేవలు తెలంగాణ ప్రజలకు కూడా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. దానికి అనుగుణంగా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఎస్టీ హోదాతో పాటు మహనీయుల జీవిత చరిత్రను పాఠ్యంశాల్లో చేర్చేలా జాతీయ సంఘం కృషి చేస్తుందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమ కార్యచరణ రూపొందించి దశల వారీగా ఆందోళనలు, నిరసనలు తెలుపుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు డాక్టర్ శ్యాంరావు పూలే, అడ్వొకేట్ కైలాష్ వాగేలా, అడ్వొకేట్ రాజేందర్ మహడోలే, సుకుమార్ పెట్కూలే, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, ఉపాధ్యక్షులు సురేష్ గుర్నూలే, కోశాధికారి సతీష్ గుర్నూలే, మహిళ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు వినోద నగోషే, జిల్లా అధ్యక్షురాలు ఉజ్వల ఉమేష్‌రావ్ డోలే, యువజన విభాగం అధ్యక్షుడు నందకిషోర్, ప్రధాన కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యం

- జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూ సంఘంతోనే సాధ్యమని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో యూనియన్ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా 1971లో సంఘం అవిర్భావించిందని గుర్తు చేశారు. ఆ నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. యూనియన్ ప్రాతినిధ్యంతో పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పెన్షన్, హెచ్‌ఆర్ఎ, అలవెన్స్‌తో పాటు ఇతర సౌకర్యాలను సాధించుకోవడం జరిగిందన్నారు. పీఆర్సీ బకాయిలు, సకల జనుల సమ్మె, అర్జిత సెలవులు, హెల్త్ కార్డులు సాధించడంలో సంఘం ప్రధాన పాత్ర పోషించిందని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు కోసం యూనియన్ ఆధ్వర్యంలో అంకితభావంతో కృషి చేస్తున్నట్లుగా వెల్లడించారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పరష్కరించుకొని, సంఘం కోసం పనిచేసిన 8 మంది విశ్రాంత కార్యకర్తలకు యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇందులో యూనియన్ ప్రతినిధులు బల్బ గజ్జారాం, కె.మోహన్, పరమేశ్వర్‌రెడ్డి, సిద్ధిరామ్, విజయ్ కుమార్, సదానందం, కె.శంకర్, భూమారెడ్డి, కృష్ణ, శేఖర్, రఘునాథ్, పరమేశ్వర్, రాజన్న, చింత మోహన్, రాజన్న, గంగాచరణ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-నార్నూర్



మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పులి ప్రసన్న హరికృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని నార్నూర్, గాదిగూడ ఇన్‌ఛార్జి సూర్యవంశీ శశాంక్, జాదవ్ బాలరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని తాడిహత్నూర్ తదితర గ్రామాల్లో ప్రచారంలో భాగంగా మద్దత్తుగా గ్రాడ్యుయేట్ అభ్యర్థులతో కలిసి మార్కెట్‌లో ప్రచారం చేశారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. ఇంటింటా తిరుగుతూ స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మొదటిగా ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. వారి వెంట సభ్యులు పవార్ జితేందర్, ఎస్ దేవానంద్, వాగ్మారే శుభం, జాదవ్ దన్‌రాజ్, శ్రీనివాస్, బబ్లు ఉన్నారు.

విజయ మిల్క్ సెంటర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

- నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-లక్షెట్టిపేట

కాలం చెల్లిన పాల పదార్థాల అమ్మకాలు



పట్టణంలోని విజయ మిల్క్ డైరీ పార్లర్‌లో శనివారం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వాసురామ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 6న నవతెలంగాణ దిన పత్రికలో 'కాలం చెల్లిన పాల పదార్థాల అమ్మకాలు' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించారు. స్థానిక విజయ మిల్క్ సెంటర్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించగా కాలంచెల్లి పాల పదార్థాలు విక్రయింట్లు గుర్తించారు. దీంతో సదరు విక్రయ దారుడు తప్పును ఒప్పుకోవడంతో నోటీసు జారీ చేశామని లైసెన్స్ లేకుండా విక్రయిస్తే జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించామని తెలిపారు. ఈ తనిఖీలో ఎలాంటి కాలంచెల్లిన పదార్థాలు లభించక పోవడంతో మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని హెచ్చరించామని తెలిపారు.

సామాజిక సేవల్లో డెంటల్ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వృత్తితో పాటు సామాజిక సేవల్లో డెంటల్ అసోసియేషన్ సభ్యులు రాణించడం అభినందనీయమని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. ఆదివారం ఓ బాంకెట్ హాలులో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరణం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅథితిగా హాజరై అధ్యక్షుడు సాయిరాంతో ప్రమాణ స్వీకరం చేయించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి చిన్మయ్ వారే ప్రమాణస్వీకరం చేసి కార్యవర్గ సభ్యులను డీఎంహెచ్ఓ కు పరిచయం చేశారు. అనంతరం డీఎంహెచ్ఓతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ డెంటల్ అసోసియేషన్ సామాజిక కార్యక్రమాల్లో ముందుంటుందన్నారు. మారుతున్న జీవన శైలిలో అనేక వ్యాధులు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్య సేవలు అందించేలా కృషి చేయాలన్నారు. అదే విధంగా బీడీఎస్ వారి సేవలు వినియోగించుకునేలా కృషి చేస్తామన్నారు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్ చేసుకోని వారు త్వరగా చేసుకోవాలని, రెన్యూవల్ దరఖాస్తులు చేయాలన్నారు. పరిశీలించి సర్టిఫికేట్లను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్‌రెడ్డి, ప్రకాష్, ప్రమోద్ రెడ్డి, సమీయోద్దిన్, ఐడీఏ కోశాధికారి సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షులు స్వప్నిల్, రత్న, సంయుక్త కార్యదర్శి నిఖిల్‌రెడ్డి, అసిస్టెంట్ కార్యదర్శి భావన పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక చేయూత



నవతెలంగాణ-భైంసా

మండలంలోని దేగాం గ్రామానికి చెందిన జి.గంగామణి అనే మహిళ గత రెండు రోజుల కింద గుండె పోటుతో మృతి చెందాగా, ఆమె భర్త గత నాలుగు నెలల కింద ఆక్సిడెంట్‌లో మృతి చెందాడు. వారికి ఉన్న ముగ్గురు ఆడపిల్లల్లో ఇద్దరికి పెండ్లిలు కాగా అప్పులభారం కావడంతో ప్రస్తుతం కూతురు సుజాత అనాథాగా మారడంతో గ్రామానికి చెందిన భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి వారిని ఆదుకోవడానికి దాతల సహకారం కోరింది. గ్రామానికి చెందిన మానవతా వాదులు ముందుకు వచ్చి తోచినంత సహాయం చేశారు. అదే విధంగా వివిధ గ్రామాల వారు సైతం ముందుకు వచ్చి ఆర్థిక సాయాన్ని అందించారు. రూ.37 వేలు రావడంతో ఆదివారం అ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డి మట్లాడుతూ పేద కుటుంబం కోసం ముందుకు వచ్చిన దాతలకు, దేగాం గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సహకారంతో అ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ప్రభుత్వం స్పందించి అ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కష్టకాలంలో ఉన్న వారికి అండగా ఉన్న సుష్మరెడ్డిని పలువురు అభినందించారు.

16వ రోజుకు చేరిన టోల్ ప్లాజా కార్మికుల సమ్మె



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఈ ప్లాజాలో తాము విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ కొత్తగా వచ్చిన ఫేర్వెల్ కంపెనీ యాజమాన్యం తమను తొలగించే ప్రయత్నం చేస్తుందన్నారు. తమ సమస్యను పరిష్కరించకపోతే నిరహర దీక్షను సైతం చేపడతామని హెచ్చరించారు.

ఎంఈఓకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్



నకిలీ ధృవీకరణ పత్రాలతో ఉద్యోగాలు పొందిన 35 మంది ఉపాధ్యాయులను హైదరాబాద్ డీఈఓను తొలగించడంతో స్థానిక జరిగిన ఉపాధ్యాయ ధృవపత్రాల పరిశలన సంచలనంగా మారింది. సన్‌షైన్ ప్రయివేట్ పాఠశాల బోనాఫైడ్‌లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంబ్లే ప్రజ్ఞశీల్, జిల్లా అధ్యక్షులు జాడీ వెంకటేష్‌లు అన్నారు. ఆదివారం మండలంలోని ఎంఈఓకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీఎస్-ఎస్ఓ ఉట్నూర్ డివిజన్ నాయకులు గాయక్వాడ్ భారత్ పాల్గొన్నారు.

సప్తహా వేడుకల్లో సాయి మౌనారెడ్డి

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని నిరాల గ్రామంలో శ్రీ సద్గురు దాదాజీ మహారాజ్ సప్తహా వేడుకలలో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది సాయి మౌన పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ, దేశెట్టి ప్రభావతి, గ్రామస్తులు చందు, నాందేవ్, జట్టే మారుతీ, కాంబ్లె విఠల్, షేక్ శంసూర్, సంతోష్, రామగిరివార్ మాధవయ్య, పిడుగు స్వామి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలో ఆదివారం ఆదివాసీ భవన్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, అనుబంధ సంఘాలు సార్మేడీలు, ఆయా గ్రామాల పటేళ్లు అందరూ కలిసి సమావేశంలో ఏకగ్రీవంగా మార్చి 8న మహిళా దినోత్సవాన్ని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పెందుర్ దాదిరావు, వెట్టి మనోజ్, గొడం రేణుక మాట్లడారు. ఆకాశంలో సగం, భూమిలో సగం, ప్రపంచంలో సగభాగమైన స్త్రీ ఆధునిక యుగంలో కూడా వివక్షతకు గురవుతూనే ఉందన్నారు. మార్చ్ 8న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే అంతర్జాతీయ మహిళ దినోత్సవాని ఆదివాసులు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెందూర్ దాదిరావు, వెట్టి మనోజ్, ఉయిక సుదర్శన్, గోడం రేణుక పాల్గొన్నారు.

ఈనెల 12న హిరాసుక జయంతి



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని పాత ఉట్నూర్ గ్రామంలో ఆదివాసి ప్రధాన్ సమాజ్ భవన్‌లో ఈనెల 12న గోండి ధర్మగురు హిరాసుక జయంతిని జయప్రదం చేయాలని, ఆదివాసీ ప్రధాన్ సమాజ్ నాయకులు మండలంలోని పాత ఉట్నూర్‌లో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ ప్రధాన్ సమాజ్ మండలాధ్యక్షులు కనక సంతోష్, కార్యదర్శి సోయం రాందాస్ మాట్లాడారు. ఆదివాసీ ప్రధాన్ సమాజ్‌కు చెందిన మేధావులు ఉద్యోగులు నిరుద్యోగులు, రాయిసెంటర్ సార్మేడి పటేళ్ళ, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొని, ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ ప్రధాన్ సమాజ్ గౌరవాధ్యక్షులు మడవి దత్తు, కోశాధికారి పుర్క గజానంద్, సంయుక్త కార్యదర్శి మాడవి బాలాజీ, ఆత్రం వెంకటేష్, ప్రచార కార్యదర్శి మారుతి, గేడం నిరంజన్, ఆత్రం లక్ష్మణ్, ఆత్రం నారాయణ, టెకం హరిప్రసాద్, మెస్రం రజనీకాంత్ పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవం విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని వడూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం పోచమ్మ, మహాలక్ష్మి తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా గణపతి హోమం, జలదివాసం వంటి పూజ కార్యక్రమాలను వేదపండితులు గుండయ్య, అనంత బాలాజీ, అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి దంపతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాంసి మండల కేంద్రంలో పోచమ్మ ఆలయ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, గ్రామస్తులు రమణయాదవ్, కాంతారెడ్డి, రాము, అనిల్, స్వామి, శ్రీనివాస్, పాటు గ్రామస్తులు ఉన్నారు.

పోచమ్మకు బోనాలు సమర్పించిన భక్తులు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ కొత్తూరు పోచమ్మ ఆలయంలో ఆదివారం మహిళలు బోనాలు సమర్పించారు. కొత్త కుండలో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ పిల్లాపాపలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ రైతన్నలకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకుంటు అమ్మవారికి బోనాలు సమర్పించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

జలం.. పాతాళం..

- అడుగంటుతున్న బోర్లు, బావులు
- వేసవిలో మరింత ఇంకిపోయే అవకాశం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. ఎండలు పెరగడం, నీటి వాడకం అధికమైంది. దీంతో నీటిమట్టాలు క్రమంగా లోతుల్లోకి పడిపోతున్నాయి. వేసవి ప్రారంభం కావడం, పంట సాగుతో పాటు ఇతర అవసరాలకు మరో రెండు నెలలకు పైగానే నీటి అవసరం పడనుంది. ఈ సమయంలో జిల్లాలో భూగర్భ జలాలు మరింత పాతాళానికి చేరనున్నాయి. ఈ సారికి వేగంగా నీటిమట్టాలు అడుగంటాయి. నీటి వినియోగం భారీగా ఉండటంతో భూగర్భ జలాలు అడుగంటుతూ చాలావరకు బోరు, బావులు సగానికిపైగా తగ్గి పోస్తున్నట్లు రైతాంగం పేర్కొంటోంది. భూగర్భ జలాలు నమ్ముకొని సాగు చేస్తున్న రబీ పంటలతో రైతన్న ఆందోళన చెందుతున్నాడు. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో అతివృష్టి ప్రభావంతో పత్తి పంట కాస్త పరువలేదనిపించిన సోయా పంట మాత్రం భారీగా దిగుబడి తగ్గింది. మరోవైపు మార్కెట్ మద్దతు ధర లేక పోవడంతో రైతన్న అప్పుల్లో కూరుకు పోయాడు. దీంతో నీటి వసతి ఉన్న రైతులు రబీ పంటలైన గోధుమ, మొక్క జొన్న, జొన్న, తదితర పంటలపై దృష్టి సారించాడు. పెట్టుబడి తక్కువ లాభం ఎక్కువగా ఉండటంతో ఈ పంటలపై గత రెండు సంవత్సరాలుగా ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని ధనోర(బి), ముత్నూర్, ధర్మసాగర్, మల్లాపూర్, గిన్నెర, ఈశ్వర్‌నగర్, వడగావ్, మెండాపల్లి, తదితర గ్రామాల్లో రబీ పంటలను అధికంగా సాగుచేస్తున్నారు. సుమారు రెండు వేల ఎకరాల్లో ఈ పంటను సాగుచేసినట్టు అంచనా, దీంట్లో గోధుమ ఇతర కూరగాయ పంటలకు వారానికి ఒక తడి అవసరం కాగా, మొక్కజొన్న పంటకు వారంలో రెండు తడులు అవసరముంటుందని రైతులు పేర్కొన్నారు. ఫిబ్రవరి నెల నుంచి మాత్రం భూగర్భజలాలు అడుగంటుకుపోవడంతో విద్యుత్ మోటార్లు కొన్ని గంటలవరకే పని చేస్తున్నాయని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు కొత్త బోర్ల వైపు దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మొక్క జొన్నకు మంచి డిమాండ్ ఉండటంతో ఆ పంటలను అధికంగా సాగు చేశారు. కాని భూగర్భజలాలు అడుగంటుకు పోవడంతో ఎలాగైనా పంటలను కాపాడుకోవాలనే ఉద్యేశంతో కొత్త బోర్లను వేస్తున్నారు.

ఇబ్బందుల్లో రైతులు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం అధికారంలోకి రాగానే ఎకరానికి రూ.15 వారి ఖాతాలోకి జమ చేస్తామన్నా ఇంతవరకు దాని ఊసేలేదని రైతన్న నిరాశ చేందుతున్నాడు. కేవలం మండలానికి ఒకే ఒక గ్రామ పంచాయతీని మోడల్‌గా ఎంపిక చేసుకుని ఆ రైతులకే రైతు భరోసా కింద నిధులను జమా చేయడం ఎంత వరకు సమంజసం మంటున్నారు. దీంతో పంట పెట్టుబడికి డబ్బులు లేక మరో వైపు భూగర్భ జలాలు అడుగంటుకుపోవడంతో రైతన్న దుస్థితి అయోమయంగా అగుపిస్తోంది.

నీళ్ల తడి సరిపోవడం లేదు



తాను కౌలుకు భూమి తీసుకుని, నాలుగు బ్యాగుల మొక్క జొన్న పంటను సాగు చేశాను. ప్రస్తుతం పంటకు నీళ్ళ తడి సరిపోక పోవడంతో మొక్క జొన్న పంట వాడి పోతుందన్నారు. దాని కోసం పంటను ఎలాగైనా రక్షించుకోవాలని ఉద్యేశంతో భూ యజమాని కొత్త బోర్ వెల్‌ను వేస్తున్నాడని పేర్కొన్నారు.

- చాటే జ్ఞానేశ్వర్ కౌలు రైతు, ఏమాయికుంట

రాష్ట్రంలో అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నీళ్లు, నిధులు, నియమకాలు అనే నినాదంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న అభివృద్ధి మాత్రం కొన్ని ప్రాంతాలకే పరిమితమైందని ఉత్తర తెలంగాణ అభివృద్ధి ఫోరం వ్యవస్థాపక చైర్మెన్ డాక్టర్ కేశవులు అన్నారు. ఆదివారం మున్నూరుకాపు సంఘ భవనంలో ఉత్తర తెలంగాణ అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజకీయ పార్టీల నాయకులు హాజరై వారి అభిప్రాయాలను తెలియజేశారు. అనంతరం మున్నూరుకాపు సంఘం తరపున డాక్టర్ కేశవులను సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణ అభివద్ధి ఫోరం చైర్మెన్ డాక్టర్ కేశవులు మాట్లాడుతూ ఎన్నో లక్ష్యాలతో సాధించిన ప్రత్యేక రాష్ట్రంలో ఉత్తర తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. కేవలం కొన్ని పాంత్రాలను అభివృద్ధి ఇతర ప్రాంతాలను పట్టించుకోలేదని మండిపడ్డారు. ఆదిలాబాద్ నీరు, ఖనిజ సంపదతో పాటు వనరులున్న అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అవుతున్న ఇంకా పల్లె వెలుగు బస్సులు వెళ్లలేని గ్రామాలు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నాయంటే అభివృద్ధి ఎక్కడ ఉందో తెలుస్తుందన్నారు. ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే రవాణ వ్యవస్థ మెరుగ్గ ఉండాలని, అది కల్పించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర తెలంగాణ ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని నాయకులకు ఉప ముఖ్యమంత్రి ఇవ్వాలన్నారు. అప్పుడే ఉత్తర తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. అప్పటి వరకు తాము జిల్లాల్లో పర్యటించి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీలు, సంఘాల నాయకులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్, జగన్ సింగ్, సంగెపు బొర్రన్న పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తాంసి

నవతెలంగాణ-తాంసి

మండలంలోని కప్పర్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2004 -2005 సంవత్సరంలో పదో తరగతి చదివి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల కప్పర్ల పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసి 20 ఏండ్ల తర్వాత ఒక చోటికి చేరారు. ముందుగా విద్యా బుద్ధులు నేర్పిన గురువులకు బ్యాండ్ బాజాలతో, ఘన స్వాగతం పలికారు. అనంతరం పరిచయాలు చేసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మరణించిన తోటి స్నేహితులకు స్మరించుకుని మౌనం పాటించారు. అనంతరం ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేసి శాలువతో సన్మానించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రస్తుతం అదే పాఠశాలలో విద్యార్థులకు నీటి సమస్య ఉండటంతో ఆ విషయాన్ని విద్యార్థులు సిబ్బంది తెలియజేయడంతో ఈ పూర్వ విద్యార్థులు రూ.15వేల విలువ గల మోటార్ పంప్ సెట్‌ను ఇతర వస్తువులను పాఠశాలకు అందజేశారు. పాఠశాలలోని నీటి సమస్యను పరిష్కరించారు. పాఠశాల తరఫున పూర్వ విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గంగా సింగ్, నితిన్, రత్నయ్య, విజయ లక్ష్మి, భజరంగ్, విజయలక్ష్మి, దేవిదాస్, యాకుబ్, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ఆనంద్, ఉపాధ్యాయులు కిష్టన్న, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

నిర్మల్‌రూరల్ : మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-2004 పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందచేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి గత స్మృతులు నెమరు వేసుకున్నారు. దాదాపు 22 ఏండ్ల తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2003-2006 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసుకున్న ఎంపీసీ, ఎంపీసీఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్మల్ పట్టణంలోని ఉత్సవ్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు 20 సంవత్సరాల తర్వాత ఒక్కచోట కలుసుకోవడంతో వారు చదువుకున్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సాయిచరణ్, రాజశేఖర్, గణేష్, హరికృష్ణ, నరేష్, సృజన, మంజుషా, ప్రసూన, శ్రీకాంత్, సృజన పాల్గొన్నారు.

పెంబి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 1995-1996వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పెంబి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులకు ఘనంగా స్వాగతం పలికి పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. 30 సంవత్సరాలకు కలిసిన మిత్రులు తమ చిన్ననాటి జ్ఞాపికాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురువులు శ్యామ్‌సుందర్ చారి, మురళీధర్, గంగారాం, సుదర్శన్, శ్రీనివాస్, బాలాజీ, ఖాజా, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

నిర్మల్ టౌన్



పెంబి



బీటీ రోడ్డు నిర్మించాలి



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని ఖంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మాదాపూర్ గ్రామ ప్రజలు రోడ్డు లేక అనేక అవస్థలు పడుతున్నారు. అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం నిర్మించిన మట్టి రోడ్డు, ఇప్పటి వరకు దిక్కయ్యిందన్నారు. గ్రామంలో 250పైన జనాభా ఉన్నారు. మండల కేంద్రానికి రావాలన్న అత్యావసర పరిస్థితుల్లో అనారోగ్య సమస్యతో అంబులెన్స్ రావాలన్న మూడు కిలో మీటరు కాలినడకతో వెళ్లాల్సిందే. వర్షాకాలంలో వర్షపు నీటితో రోడ్డుపై ఉన్న మట్టి తొలగి పోవడంతో రోడ్డుపై ఉన్న బండ రాళ్లతో పోవడానికి ఇబ్బందులు తప్పడంలేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మూడు కీలో మీటర్ల బీటీ రోడ్డుకు కోటి 30 లక్షలు మంజూరు చేసిందని బడ్జెట్ లేక టెండరు ముందుకు రాక పోవడంతో పనులు కొనసాగడం లేదని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి...

జాదవ్ శేఖర్, దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు



మాదాపూర్ గ్రామస్తులకు మూడు కిలో మీటర్ల దూరం రోడ్డు లేక పోవడంతో అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపి టెండర్‌ను ముందుకు పిలిపించి, రోడ్డు పనులు నిర్వహించి, రోడ్డు సమస్యను పరిష్కరించాలి. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

బీజేపీ గెలుపు సంబరాలు



నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు నిన్న ఢిల్లీ అసంబ్లీలో బీజేపీ గెలుపు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యకులు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే అసంబ్లీ ఎన్నికలలో మన తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం కట్కం రాందాస్, కాళ్ల మోహన్, కిసాన్ మోర్చా అధ్యక్షులు రాకేష్ రెడ్డి, అశోక్, రమేష్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ తల్లి జాతర



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలం కడ్తాల్ గ్రామ ప్రజల ఇలవేల్పు అయిన పెద్దమ్మ తల్లి ఉత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు నెత్తిన బోనం ఎత్తుకొని పుర వీధుల గుండా ఊరేగింపు చేసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

యూత్ మండలాధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-కడెం

ఇటీవల నిర్మల్ జిల్లా ఆర్టీఏ మెంబర్‌గా ఎంపికైన తుమ్మల మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ మండల యువజన అధ్యక్షులుగా రేంకల శ్రీనివాస్ యాదవ్‌ను ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు తారి శంకర్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల బాలవ్వ లచ్చన్న, కాంగ్రెస్ గ్రామాధ్యక్షులు బోదాసు రాజన్న, మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఊరే జలజ, టీసీ అధ్యక్షులు నర్సయ్య, ముస్కు రాజేందర్‌రెడ్డి, బొంగు గంగాధర్‌గౌడ్, కాసుల భూమన్న గోష్కుల మల్లేష్, పడాల లింగన్న, మాదాసు సత్తన్న, కొల శ్రీనివాస్, సుమన్, రాజేశ్వర్, వెంకటి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | ఫిబ్రవరి 10, 2025 | www.navatelangana.com

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని కర్జెల్లి గ్రామానికి చెందిన డోకే రుషి తన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సమాచారం మేరకు రుషి ఇంటిని తనిఖీ చేశారు. ఇక్కడ రేషన్ బియ్యంను మహారాష్ట్రకు అధిక రేటుకు అమ్ముకోవడానికి నిల్వ ఉంచినట్టు గుర్తించారు. ఆరు సంచుల్లో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైన అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరిగినట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచరం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

సమ్మక్కకు మొక్కలు తీర్చుకున్న భక్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఈ నెల 12, 13, 14, 15 తేదీలలో నిర్వహించనున్న మినీ మేడారం జాతర దృష్టిలో ఉంచుకొని కాగజ్‌నగర్ పట్టణానికి సమీపంలో ఉన్న సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద ఆదివారం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సమీపంలోనే ఉన్న గాంధారి మైసమ్మ, ఊరు పోచమ్మ అమ్మవారి మొక్కులు కూడా తీర్చుకున్నారు. మినీ మేడారం జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జాతర కమిటీ అధ్యక్షులు తుమ్మ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో పోలోజు శ్రీనివాస్, మంద రాజయ్య, పిర్సింగుల శ్రీనివాస్, కోట శంకర్, పిర్సింగుల తిరుపతి పాల్గొన్నారు.

అడవిలో పర్యటించిన విద్యార్థులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని అన్వర్ ఉర్దూ పాఠశాల విద్యార్థులు ఆదివారం అడవిలో పర్యటించి అటవీ అందాలను వీక్షించారు. వనదర్శిని కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. సిర్పూరు రేంజ్ పరిధిలోని చింతకుంట అటవీ ప్రాంతంలో విద్యార్థులు పర్యటించి సోలార్‌కుంట, చెక్‌డ్యాం, భూపాలపట్నం వ్యూ పాయింట్‌లను తిలకించారు. అటవీ మార్గంలో కాలినడకన వెళుతూ చెట్లు, పక్షులను తిలకిస్తూ, జంతువుల అడుగులను ఆసక్తిగా గమనించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ అటవీ, వన్యప్రాణుల సంరక్షణ కోసం తాము తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. భవిష్యత్తు తరాల మనుగడకు అడవులు ఎంతో అవసరమని, ఇందులో విద్యార్థులు కూడా భాగస్వామ్యం కావాలని చెపుతూ వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి ప్రసాద్‌రావు, బీట్ అధికారులు మల్లిఖార్జున్, రవీనా, వాచర్లు ఇర్ఫాన్, భీంరావు, లింగన్న పాల్గొన్నారు.

శారీరక, మానసిక ధృఢత్వానికి క్రీడలు అవసరం

- బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్



నవతెలంగాణ-కాసిపేట

శారీరక, మానసిక ధృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ముత్యంపల్లి క్రీడా మైదానంలో జరుగుతున్న కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ టోర్నీ ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్, బ్రేవ్ హార్ట్స్ సోల్జర్స్ జట్ల మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో బ్రేవ్ హార్ట్స్ సోల్జర్స్ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్స్కు రూ.50 వేలు, రన్నర్స్కు రూ.30 వేల నగదుతో పాటు ట్రోఫీలను బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల ఎన్నో లాభాలున్నాయన్నారు. శారీరకంగా, ఆరోగ్యంగా, మానసిక ధృఢత్వానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు క్రీడల్లో ఖచ్చితంగా పాల్గొనాలన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఉండాలన్నారు. క్రీడలు దేశ భక్తిని కూడా అలవరుస్తుందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాల్లో కూడా అవకాశాలు ఉంటాయన్నారు. క్రీడలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత సోషల్ మీడియా చూసుకుంటూ సమయం వృథా చేసుకోవద్దన్నారు. క్రీడలతో గంజాయికి దూరంగా ఉండవచ్చన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి అన్ని రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా విజయం సాధిస్తున్నారన్నారు. యువతను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీల కార్యక్రమాలు అవసరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్ కుమార్, నిర్వాహకులు కమటం తిరుపతి, నామసామి రాజు, అప్పాల శేఖర్, పూటూరి సాయి కుమార్, ఇంగు నారాయణ, దాసరి శంకర్, నస్పూరి నర్సింగ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి ధర్నా విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న సానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం నేడు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ధర్నా తర్వాత కలెక్టర్ కు వినతి పత్రం అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం





నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రాల్లోని జిల్లా కార్యాలయంలో పీఆర్టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సునర్కార్ అనిల్‌తో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు. మెరుగైన పీఆర్సీ సాధన కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ రద్దుకు నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కేజీబీవీ, ఐటీడీఏలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రెగ్యులర్ స్కేలుకు కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల బాగోగుల కోసం నిరంతరం కృషి చేస్తున్న తమ సంఘం తరపున రాబోయే శాసనమండలి ఎన్నికలలో కరీంనగర్ శాసనమండలి ఉపాధ్యాయ అభ్యర్థిగా వంగ మహేందర్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని, ప్రతి ఒక్కరు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా సంఘ అభివృద్ధి కోసం కృషి చేసిన ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయలను శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నరసింహ చారి, బోర్సింగ్ కుమార్, రవి, పొడసం సోనేరం, భరత్ కుమార్, బిక్షపతి, సాంబశివరావు, ఇంద్ర, ప్రకాష్, జాడి దేవాది, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, దెబ్బటి సత్యనారాయణ, మడవి హనుమంతు, జాడి రాహుల్, జ్ఞానేశ్వర్, రేగళ్ల వెంకటేశ్వర్, ఖాదర్, వినోద్, ఉదయ బాబు, కవిత, శ్రీలత పాల్గొన్నారు.

వంగ మహేందర్ రెడ్డి కి మద్దతుగా ప్రచారం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పీఆర్టీయూ టీఎస్ సంఘం బలపరిచిన అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డికి మద్దతుగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేందర్ రెడ్డి ఉపాధ్యాయ సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉన్న వ్యక్తి అని తెలిపారు. ఆయనకు చట్టసభల్లో అవకాశం ఇచ్చి సమస్యల పరిష్కారం కోసం ముందుండే విధంగా ప్రోత్సాహం అందించాలని కోరారు. సీపీఎస్ రద్దు, 317 జీఓ సమస్యల పరిష్కారంతో పాటు జటిలమైన సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడమే లక్ష్యమన్నారు. ఉపాధ్యాయుల సమస్యలే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతారన్నారు. ఉపాధ్యాయ అభ్యర్థిగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్ కుమార్, నాయకులు ఇందారపు ప్రకాష్, గోర్‌సింగ్, కుమ్మరి రవి, తోడసం సోనేరావు, సునార్కర్ భరత్, కవిత, శ్రీలత, జాడి రాహుల్ పాల్గొన్నారు.



'నా వ్యాఖ్యలను కేటీఆర్ వక్రీకరిస్తున్నారు'

- ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తాను అసెంబ్లీలో మాట్లాడిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ వక్రీకరించడం ఆయన స్థాయికి తగదని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన కాగజ్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. సిర్పూరు నియోజకవర్గాన్ని మహారాష్ట్రలో కలపాలని తాను అసెంబ్లీలో మాట్లాడినట్లుగా చెపుతూ తనను అవహేళన చేస్తూ కేటీఆర్ మాట్లాడారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గడిచిన పదేండ్ల కాలంలో సిర్పూరు నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిందని, ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే ఒరవడిని కొనసాగిస్తుండడంతో వీరికి కనువిప్పు కలగాలనే ఉద్దేశంతో తాను ఆ వ్యాఖ్యలు చేస్తే దీనిని వక్రీకరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాను అసెంబ్లీలో మాట్లాడిన సమయంలో కేటీఆర్, ఆయన తండ్రి కేసీఆర్ ఇద్దరు కూడా అసెంబ్లీలో లేరనే విషయం కేటీఆర్ గుర్తుంచుకోవాలని సూచించారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, దీనికి కేటీఆర్ సిద్ధంగా ఉన్నారా అని సవాల్ చేశారు. ఆ వ్యాఖ్యలను కేటీఆర్ ఉపసంహరించుకొని వెంటనే నియోజకవర్గ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గురుకుల వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఎంతో ఉత్సాహంగా విద్యార్థులు వేడుకల్లో డాన్సులతో హంగామా చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కాకి లెక్కలతో బీసీలను మోసం చేస్తున్నారు

బీసీ సంఘాల నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లు కాకి లెక్కలతో బీసీలను మోసం చేస్తున్నారని బీసీ సంఘాల నాయకులు మండిపడ్డారు. ఆదివారం బాలభారతి ఉన్నత పాఠశాలలో బీసీ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్ డివిజన్ నాయకులు, న్యాయవాది నికోడె రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో బీసీల సమస్యలు, హక్కులపై చర్చించారు. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన పాలకులు 'ఓట్లు మావి సీట్లు అగ్రకులాలవి' అనే విధంగా కరీంనగర్ ఎమ్మెల్సీ స్థానాన్ని రెడ్డిలకు కేటాయించారని మండిపడ్డారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, పేద బీసీ విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, బీసీ జనాభాకు తగ్గట్లుగా క్రిమిలేయర్‌తో సంబంధం లేకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచాలనీ, చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలను చైతన్యం చేయడానికి ఆ వర్గం మేధావులు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పొన్న రమేష్, నికోడె అర్జున్, గుళ్లపల్లి నాగేశ్వర్‌రావు, సుంకరి తిరుపతి, గజ్జల లక్ష్మణ్, మాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



నవతెలంగాణ-దహేగాం

గెలుపోటములను సమానంగా తీసుకోవాలని బీజేపీ నాయకుడు పాల్వాయి సుధాకర్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని హత్తిని గ్రామంలో నిర్వహిస్తున్న పాల్వాయి పురుషోత్తమరావు స్మారక క్రికెట్, వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలీబాల్, క్రికెట్ క్రీడాకారులకు గ్రామానికి చెందిన యువజన నాయకుడు షేగం రాకేష్ సొంత ఖర్చులతో జెర్సీలను క్రీడాకారులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని, మండల స్థాయితో పాటు రాష్ట్రస్థాయిలో ఆడి సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, రాజాగౌడ్, శ్రీకాంత్, కేదారి పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల తరువాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బాబాసాగర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1983-1984 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులంతా వారి పూర్వ స్మృతులను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పాదపూజలు చేసిన శాలువలు, పుష్ప గుచ్చాలతో ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు, బహుమతులను అందచేశారు. పాఠశాలతో వారికున్న అనుబంధాన్ని పంచుకుంటు సందడి చేశారు. ప్రస్తుతం వారు స్థిరపడిన రంగాల గురించి తెలుసుకుంటు సెల్ఫి దిగారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి విందు భోజనం చేశారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు నగర స్వామీ, మురళీధర్ రావు, మల్లయ్య, ప్రభాకర్ రావు, హన్మంతు రెడ్డి, పసిక్ అహ్మద్, పూర్వ విద్యార్థులు డుబ్బుల నానయ్య, సత్పుతే తుకారం, ఎల్ములే మల్లయ్య, రూపచారి, పర్శ చంద్రశేఖర్, నందేవ్, డొకె నారాయణ, జనార్దన్, గమ్మిదాస్, విష్ణుదాస్ మస్కూర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్‌కు మద్దతు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అశోక్ కుమార్‌కు తమ సంఘం మద్దతు ఉండనున్నట్లు గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి నాయిని శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నవీన్ రెడ్డి, శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్ కుమార్ ఒక ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. అశోక్ కుమార్ 36 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధత, నిజాయితీతో పని చేస్తున్నారని తెలిపారు. అటువంటి వ్యక్తి చట్టసభల్లో ఉండడం వల్ల సమస్యల పరిష్కారం కోసం దారి దొరుకుతుందని, గెజిటెడ్ లెక్చరర్స్ అందరు కూడా ప్రథమ ప్రాధాన్యత ఓటు ఆయనకే వేసి గెలిపించాలని కోరారు.

అంబేద్కర్ సమాజ్ రత్న రాష్ట్రీయ అవార్డుకు ఎంపిక

నవతెలంగాణ-వాంకిడి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమాజ్ రత్న రాష్ట్రీయ అవార్డుకు మండల కేంద్రానికి చెందిన పుల్లం ఉల్లాస్, బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, సమత సైనిక్ దళ్ జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్ ఎంపికైనట్టు అఖిల భారత్ గురు రవిదాస్ సమత పరిషత్ ప్రకటించింది. ఈ నెల 12న ఆదిలాబాద్‌లో గురు రవిదాస్ జయంతి సందర్భంగా ఈ అవార్డును అందజేయనున్నట్టు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మదు బావోల్కర్ తెలిపారు. సామాజిక కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేసినందుకు ఈ అవార్డును ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మండల వాసులు ఆయన ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | ఫిబ్రవరి 10, 2025 | www.navatelangana.com

బీరు సీసాతో దాడి చేసిన కేసులో ముగ్గురు అరెస్ట్

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి ఎస్‌ఆర్‌ఆర్ బార్‌లో బండారి వంశీ తాండూర్‌కు చెందిన బండారి శ్రీను అనే వ్యక్తిపై బీర్ సీసాలతో కొట్టి, మూకుమ్మడిగా దాడి చేసిన సంఘటనలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు టూ టౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. బెల్లంపల్లి 2 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ముగ్గురు నిందితులు అల్లి సాగర్(గాంధీ నగర్, బెల్లంపల్లి), రత్నం సోమయ్య (బట్వన్ పల్లి), మామిడి అన్నమయ్య(ఇస్లాంపుర మంచిర్యాల) అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పర్చామని తెలిపారు.

కవ్వాల్ అభయారణ్యాన్ని సందర్శించిన సివిల్ జడ్జి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కవ్వాల్ అభయారణ్యాన్ని నిర్మల్ జిల్లా కోర్టు సివిల్ జడ్జి శ్రీనివాస్ సందర్శించారు. ఆదివారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి జన్నారం అటవీ రేంజ్ పరిధిలోని గోండుగూడా, తదితర అటవీ ప్రాంతాలను సందర్శించారు. అభయారణ్యం, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి జడ్జికి అటవీ అధికారులు వివరించారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



నవతెలంగాణ-జైపూర్

వేసవిలో కాలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు గ్రామ పంచాయతీల వారిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ రాజమల్లు ఆధ్వర్యంలో ఆదివారం భీమారం మండల కేంద్రంలో వార్డుల వారిగా నీటి సరఫరా తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ద్వార సరఫరా చేస్తున్న నీరు ప్రతి ఇంటికి సరఫరా చేయాలన్న సంకల్పంతో పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు ఎప్పటికప్పుడు క్లీన్ చేయడమే కాకుండా నీటి సరఫరాలో ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ మేరకు ఆవుడం ఎక్స్ రోడ్డు పరిసరల కాలనీల్లో పర్యటించి నీటి సరఫరా తీరుపై స్థానికుల అభిప్రాయాలు అడిగి తెల్సుకున్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే సమచారం అందించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండల పరిధిలో గ్రామ పంచాయతీల వారిగా నీటి సరఫరా తీరు ప్రత్యక్షంగా పరిశీలించి సమస్యలను పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భీమారం గ్రామ పంచాయతీ సిబ్బంది క్రిష్ణమూర్తి గౌడ్, భరత్ పాల్గొన్నారు.

14న బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలి



నవతెలంగాణ-నస్పూర్

మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని నస్పూర్ మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోషిక మనోజ్ కుమార్ కోరారు. ఆదివారం సీసీసీలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఏకపక్షంతో జరిగిందని, ఇది దళితులకు జరిగిన అన్యామని అన్నారు. ఎస్సీ వర్గీ కోసం కమిటీలు వేస్తున్నామని ప్రజలను మభ్యపెట్టి ఎటువంటి నిరాధారణమైన సమీక్ష నిర్వహించకుండా కులగనణ సరిగా చేయకుండా, అటు బీసీలను ఇటు దళితులను ఒక రకంగా మోసం చేసిందని విమర్శించారు. అందరం విడివిడిగా కొట్లాడటం వల్ల ఎవరైతే రాజ్యాధికారం పొందుతున్నారో వాళ్ళు ఇంకా రాజ్యాధికారం పొందుతూనే ఉంటారని, అందరం కలిసి కొట్లాడాల్సిన అవసరం ఉందని బహుజనులు అందరూ ఏకం కావాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు ఓలపు రవి, జువాజి నందయ్య, శేఖర్, నరహరి పాల్గొన్నారు.

పోలీస్ వర్సెస్ విలేకరుల జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో ముత్యంపల్లి క్రీడా మైదానంలో కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ సీజనల్-3 ఆధ్వర్యంలో మందమర్రి సర్కిల్ పోలీస్ జట్టు, ప్రెస్ ఆఫీసర్స్ జట్టు మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. సర్కిల్ పోలీస్ జట్టుకు కెప్టెన్‌గా మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ప్రెస్ ఆఫీసర్స్ జట్టుకు చెట్టి శ్రీధర్ కెప్టెన్‌గా వ్యవహరించారు. హోరాహోరీగా సాగిన క్రికెట్ మ్యాచ్‌లో మందమర్రి సర్కిల్ పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మేరకు మందమర్రి సర్కిల్ పోలీస్ జట్టుకు విజేత ట్రోఫీతో పాటు ప్రెస్ ఆఫీసర్స్ జట్టుకు రన్నర్ బహుమతి అందించారు. ఆటలతో మానసిక ప్రశాంతత ఉంటుందని ఏఎస్పీ అన్నారు. కార్యక్రమంలో కాసిపేట, దేవాపూర్, రామకృష్ణపూర్, మందమర్రి ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, ఆంజనేయులు, రాజశేఖర్, రాజశేఖర్, మ్యాచ్ నిర్వాహకులు కమటం తిరుపతి, నామ స్వామి, రాజు, విలేకరులు పాల్గొన్నారు.

స్థలం చదును పేరుతో అక్రమాలు

- ఎమ్మెల్యే అనుచరులపై బీఆర్ఎస్ నాయకులు ఆరోపణ



నవతెలంగాణ-జైపూర్

చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్నట్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు కలెగూర రాజకుమార్ అన్నారు. భీమారం మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం ఆయన పార్టీ డైరీలు, క్యాలండర్లు పంపిణీ చేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ భీమారం యువకులు ఆట స్థలం ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను ఆసరా చేసుకున్న ఎమ్మెల్యే వివేక్ ఒక్క రూపాయి మంజూరు చేయించకుండా ఆట స్థలం చదును పేరుతో అక్కడి మొరం, కంకర అమ్ముకోవడానికి పూనుకున్నారని ఆరోపించచరు. అభివృద్ధి పనులు పక్కన పెట్టి పాలాభిషేకాలు చేయించుకోవడం ఆయనకే చెల్లిందని విమ్మర్శించారు. పదవీ కాంక్షతో ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధిని విస్మరించారని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే జైపూర్ సింగరేణి థర్మల్ ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చిన వివేక్ పవర్‌ప్లాంట్‌లో ఏ ఒక్కరికి ఉద్యోగం ఇప్పిచ్చింది లేదని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో భీమారం మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ స్థలం కెటాయించారని తెలిపారు. ఇక్కడి యువకుల ఆకాంక్షను ఆసరా చేసుకుని ఆట స్థలం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ప్రభుత్వం నుండి ఏమాత్రం నిధులు విడుదల చేయకుండా కార్యకర్తలతో పాలాభిషేకం చేయించుకున్నారని విమ్మర్శించారు. యువతను తప్పుదోవ పట్టించేందుకు ఆట స్థలం ఏర్పాటు చేస్తామని ముందుకు వచ్చిన వివేక్ ప్రభుత్వం నుండి నిధులు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాంపూర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ దాసరి మధునయ్య, మణిదీప్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణకు ఉద్యమం చేస్తాం

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం, సంస్థ పరిరక్షణకు సింగరేణి వ్యాప్తంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో త్వరలో సేవ్ సింగరేణి పేరుతో ఉద్యమాలు చేస్తామని గుర్తింపు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగి సంవత్సరకాలం గడిచిన యాజమాన్యం ఇప్పటివరకు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కాలానుగుణంగా జరిగే స్ట్రక్చర్ సమావేశాలను నిర్వహించడం లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పేరుతో స్ట్రక్చర్ సమావేశాలను వాయిదా వేయడం ఏంటని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం మొన్నటి వరకు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలకు లేని ఎన్నికల కోడ్, ప్రభుత్వ పథకాలు మొదలైన లేని ఎన్నికల కోడ్ సింగరేణిలో జరిగే స్ట్రక్చర్ సమావేశాలకు ఎక్కడిదని వారు ప్రశ్నించారు. ఎంత పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో పూర్తిస్థాయి డైరెక్టర్లు లేకపోవడం వల్ల పాలన వ్యవస్థ గాడి తప్పుతుందని వెంటనే పూర్తిస్థాయి డైరెక్టర్లను నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, నాగభూషణం, మల్లేష్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శులు మురళి చౌదరి, సారయ్య, నవీన్ రెడ్డి, ఆకుల లక్ష్మణ్, సందీప్, కుమారస్వామి, సంగం సదానందం పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మందమర్రి



శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 25 ఏళ్ల విరామం తరువాత మళ్లీ ఒకేచోట కలుసుకున్న విద్యార్థులు, తమ బాల్యానుభూతులను పంచుకుని, నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సన్మానించారు. అప్పటి ప్రధాన ఆచార్యులు రావుల సుధాకర్ రావు షష్టిపూర్తి సందర్బంగా సుధాకర్ రావు రమాదేవి దంపతులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకర్ రావు మాట్లాడుతూ నా విద్యార్థులే నా సంపద విద్యార్థుల ఆధ్వర్యంలో షష్టిపూర్తి చేసుకోవడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేసారు. నా శిష్యులంతా ఉన్నత స్థానాలను అధిరోహించి సమాజంలో ఆదర్శప్రాయులుగా నిలవాలని ఆకాంక్షించారు. కూచిపూడి నాట్యగురువు అన్నం కల్పన చేసిన అద్భుతమైన నృత్యం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు ఆమెను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో 1999-2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, అప్పటి గురువులు పాల్గొన్నారు.

నస్పూర్ : ఝాన్సీ ఉన్నత పాఠశాలలో 20 ఏళ్ల క్రితం 2004-05లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం నస్పూర్‌లోని ఒక ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో తమ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. తమ జీవితాల్లో సాధించిన విజయాల గురించి వేదికపై పంచుకున్నారు. సమ్మేళనానికి హాజరైన గురువులు యాదవ్, సత్యవతి, రవి, ప్రేమనంద్, యాకుబ్, కాశీం, సంపత్ పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికాలను అందజేశారు. అలాగే గురువులు వారి యొక్క పూర్వ అనుభూతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుజాత, వనజ, చంద్రకళ ,అక్బర్, రామకృష్ణ, సుమన్ రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

శివనామ స్మరణలతో మార్మోగిన పర్వత గిరి



నవతెలంగాణ-జైపూర్

గుట్ట దొనలో లింగారుడై వెలసిన గట్టు మల్లన్న నామ స్మరణతో వేలాల పర్వత గిరి మారు మ్రోగింది. ప్రతి నెల ఆరుద్ర నక్షత్రాన ఆనవాయితిగా చేపడుతున్న గరి ప్రదక్షిణలో భాగంగా ఆదివారం గట్టుమల్లన్న పర్వత గిరి ప్రదక్షిణకు భక్తులు భారీగా తరలివచ్చారు. వేలాల గట్టుమల్లన్న గిరి ప్రదక్షిణ భక్తుల సౌకర్యార్థం మంచిర్యాల ఆర్టీసీ డిపో నుండి ప్రత్యేకంగా బస్సు సర్వీస్సు ఏర్పాటు చేయడంతో దూర ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. 4వ గిరి ప్రదక్షిణ సందర్బంగా తరలివచ్చిన భక్తులు గట్టుమల్లన్న గుట్ట చుట్టు తిరుగుతూ శివనామాన్ని జపించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల్లో అత్యధికంగా యువతీ యువకులు పాల్గొనగా చిలుకూరి బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారాం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మెన్ చొప్పకట్ల శ్రీకాంత్, గిరి ప్రదక్షిణ కమిటి సభుయలు రాజేశ్ శర్మ, కర్ణకంటి రవీందర్, ప్యాగ లక్ష్మన్, డేగ నగేష్ పటేల్, రాజా రమేష్, రాఘవేంద్ర స్వామి, సదనపు సంతోష్, రమేష్ గౌడ్, హిందు ఉత్సవ కమిటి సభ్యులు రవీందర్, చత్రపతి శివాజీ సేనా సమితి వ్యవస్థాపకులు ఉదయ్ కిరణ్, పూదరి రవీందర్, మల్క ప్రతాప్, వేలాల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి విద్యాసాగర్, సీపీఓ సత్యంతో పాటు భక్తులు పాల్గొన్నారు.

గట్టుమల్లన్న సన్నిధిలో అన్నధానం

గిరి ప్రదక్షిణలో పాల్గొనేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులకు గట్టుమల్లన్న సన్నిధిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన వర్తక వ్యాపారులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అన్నదానం ఏర్పాటుకు జైపూర్ మండల కేంద్రానికి చెందిన చీనూరి కవిత రాజబాబు, రాచర్ల మమత సతీష్, రాచర్ల కావ్య శ్రీనివాస్, హరిత రాజేశ్, మాదాసు లావణ్య రమేష్ గౌడ్, శిరీష్ శ్యాంసుందర్ రెడ్డి, రాము, తిరుపతి, జ్యోతి మల్లేష్‌లు ఆర్థిక సహకారం అందించారు.

నవ చైతన్య యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-లక్షెట్టిపేట

నవచైతన్య యువజన సంఘం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దమ్మ నారాయణ సమక్షంలో నవ చైతన్య యువజన సంఘ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దమ్మ కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మంచాల ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షులుగా మంచాల రామస్వామి, కోశాధికారిగా దమ్మసాయి వినయ్, సలహాదారులుగా దమ్మ నారాయణ, మంద కిషోర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో వివిధ సేవతో పాటు ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



నవతెలంగాణ-తాండూర్

గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టే అవకాశం ఉందని కన్నేపల్లి ఎస్ఐ గంగారాం అన్నారు. కన్నేపల్లి మండలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని టేకులపల్లి, జనకపూర్, జజ్జరవెల్లి గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రత ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగప డతాయని తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారులు బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు, దాతలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఏఎస్ఐకి మాజీ సర్పంచ్ సన్మానం



నవతెలంగాణ-జన్నారం

ములుగు జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఇటీవలే ఏఎస్ఐగా పదోన్నతి పొందిన మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన దూడ భూమయ్యను ఆ గ్రామం మాజీ సర్పంచ్‌లు మల్క లక్ష్మణ్, ఉప్పు శ్రీనివాస్ శాలువా, పూలమాలలతో సత్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్ఐ స్థాయికి ఎదగడం చాలా సంతోషకరమన్నారు. రాబోవు కాలంలో మరిన్ని ఉద్యోగోన్నతుల పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రోటి గూడ గ్రామంలో ఉన్న యువకులకు ఆదివారం గ్రామ మాజీ సర్పంచ్ ఉప్పు శ్రీనివాస్ వాలీబాల్ కిట్లను అందజేశారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు అలవాటు కావద్దని సూచించారు. చదువు, క్రీడలపై ఆసక్తి చూపించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

ఢిల్లీకి బయలుదేరిన ఎల్ఐసీ ఏజెంట్‌లు



నవతెలంగాణ-మంచిర్యాల

ఏజెంట్స్ ఆర్గనైజెషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీ లోని పార్లమెంట్ భవన్ ఎదుట ధర్నాకు ఆదివారం మంచిర్యాల, కరీంనగర్ బ్రాంచ్‌కు చెందిన ఎల్ఐసీ ఏజెంట్లు బయలు దేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు, బీమా రంగంలో విధేశి పెట్టు బడుల పరిమితి పెంపును విరమించు కోవాలని డిమాండ్ చేస్తూ లక్ష మంది ఏజెంట్‌లతో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏజెంట్‌ల కమిషన్‌లు తగ్గించే ప్రయత్నలను విరమించు కోవాలని డిమాండ్ చేశారు. ఏజెంట్‌ల ప్రయోజనాలకు భంగం కలిగించే బీమా సుగం పోర్టబిలిటీని రద్దు చేయాలన్నారు.దేశ వ్యాప్తంగా ఉన్న ఎల్ఐసీ ఏజెంట్‌ల ప్రయోజనాల రక్షణ కోసం సంక్షేమ చర్యలు చేపట్టాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు కొనసాగుతాయన్నారు. ఏఐవో సంఘం కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు పి రాజబాబు, మంచిర్యాల బ్రాంచ్ బాధ్యులు గంగాధరి తిరుపతి, కట కొజ్జల మహేష్, లక్ష్మీనారాయణ స్వామి, వేణు పాల్గొన్నారు.